క్లుప్తంగా

మురుగు కాల్వల పరిశీలన



రోడ్లు, డ్రైనేజీలను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్ గూడలో శుక్రవారం మేయర్ పారిజాత మురుగు కాల్వలను పరిశీలించారు. 3వ డివిజన్‌లోని న్యూమధురనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారులతో కలిసి వెళ్లారు. అలాగే 24వ డివిజన్‌లోని విశాఖనగర్ కాలనీలో రోడ్లను పరిశీలించారు. రోడ్ల మరమ్మతులు చేపట్టి బోనాల సందర్భంగా ప్రజలకు, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈఈ వినీల్‌రెడ్డి, కార్పొరేటర్లు రాంరెడ్డి, మాధురి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తిరుమల్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శూరకర్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మీర్‌పేటవాసికి సేవారత్న అవార్డు



రవీంద్రభారతిలో సేవారత్న అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్‌కు చెందిన కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డిని కురుగంటి కళాక్షేత్రం, చారిటబుల్ ట్రస్ట్ 2024 సంవత్సరానికి గాను సేవారత్న అవార్డుకు ఎంపిక చేసింది. తెలంగాణ ప్రభుత్వ భాషా, సంస్కృతి శాఖ సహకారంతో శుక్రవారం నగరంలోని రవీంద్రభారతిలో కంచర్ల శ్రీనివాస్(శ్రీ రామదాసు 10వ తరం) చేతుల మీదుగా వెంకటేశ్వర్‌రెడ్డికి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వీటీ రాయల్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్తులోనూ తన ఫౌండేషన్ తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానన్నారు. కురుగంటి కళాక్షేత్రం 27వ వార్షికోత్సవం సందర్భంగా సేవారత్న అవార్డుకు ఎంపిక చేసిన కురుగంటి రాధిక సుదర్శన్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మీర్‌పేట మేయర్ దుర్గ



కుండీలో నిల్వ ఉన్న నీటిని పారాబోస్తున్న మేయర్ దుర్గ

మీర్‌పేట:సీజనల్ వ్యాధులతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ సూచించారు. 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మేయర్ 15వ డివిజన్ మిథులానగర్ కాలనీలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలోపాల్గొన్నారు.వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని,కాలనీవాసులు ఇళ్లలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అనంతరం కాలనీ రోడ్లపై ఉన్న చెత్తను సిబ్బందిచే తొలగించి బ్లీచింగ్ చల్లించారు. దీంతో పాటు ఇళ్లలోని మొక్కల కుండీలలో నీటిని నిల్వ ఉంచకూడదని కాలనీవాసులకు వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సూపర్‌వైజర్ ఇంద్రసేనారెడ్డి, కాలనీవాసులు హారతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఫణిరాజ్ పాల్గొన్నారు.

గట్టుగిరికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న గిరి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమ వ్యవస్థాపక ఫౌండర్ గట్టుగిరి సేవలను గుర్తించి డాక్టరేట్‌తో పాటు పద్మ ప్రతిభ అవార్డును అందించారు. తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ కళా ప్రాంగణంలో శుక్రవారం ఐఎస్‌ఓ సర్టిఫైడ్ మనం ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గట్టుగిరి.. మానసిక దివ్యాంగులకు చేస్తున్న సేవలను గుర్తించిన మనం ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టరేట్‌తో పాటు పద్మ ప్రతిభ పురస్కారం అవార్డు అందజేసి సత్కరించారు. ఈ అవార్డును సినీహీరో సుమన్ చేతుల మీదుగా గిరి అందుకున్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు చక్రవర్తికి గిరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అడ్డుగా ముళ్ల కంచె!

- రోడ్డు పనులకోసం డాక్టర్స్‌కాలనీ–క్రాంతినగర్ మధ్య ఫెన్సింగ్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- తొలగించాలని అధికారులకు స్థానికుల విజ్ఞప్తి
- పట్టించుకోని అధికారులు



రోడ్డుకు కంచెవేసిన దృశ్యం

హుడాకాంప్లెక్స్: రెండు కాలనీల మధ్య వెలసిన అడ్డుగోడలు ఇరు ప్రాంతాల ప్రజలను, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సమీపంలోని మార్కెట్లకు, ఆఫీసులకు, దుకాణాలకు వెళ్లాలంటే కాలనీలమీదుగా తిరిగి..తిరిగి వెళ్లాల్సి వస్తోంది.తక్షణమే ఈ ఇనుప కంచెలను తొలగించి, ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఫెన్సింగ్‌తో ఇక్కట్లు..

సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్‌కాలనీ నుంచి క్రాంతినగర్‌కు వెళ్లే మార్గంలో జీహెచ్‌ఎంసీ సీసీ రోడ్డు పనులు చేపట్టింది. దీంతో తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయంగా ఉన్న రోడ్డుకు అడ్డుగా ఇనుప కంచె వేశారు. అటు నుంచి ఇటు..ఇటు నుంచి అటుగా వెళ్లాలనుకునే వాహనదారులు, పాదాచారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

చుట్టూ తిరగాల్సిందే..!

డాక్టర్స్ కాలనీ వాసులతో పాటు ఇతర కాలనీలకు చెందిన ప్రజలు మున్సిపల్ ఆఫీసుకు చేరుకోవాలంటే విజయవాడ ప్రధాన రహదారి మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. అసలే వాహనాల రద్దీ..తరచూ వెలుగు చూసే రోడ్డు ప్రమాదాలతో ప్రజలు అటు వైపు వెళ్లేందుకు జంకుతున్నారు. కాలనీల మధ్య అడ్డుకట్టగా వేసిన ఇనుప కంచెను తొలగించి, దారి ఏర్పాటు చేయాల్సిందిగా స్థానికులు జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గేటెడ్ కమ్యూనిటీలా..



డాక్టర్స్ కాలనీ నుంచి క్రాంతినగర్, వికాస్‌నగర్‌లకు వెళ్తుంటారు. అటు నుంచి సరూర్‌నగర్ మండల రెవెన్యూ ఆఫీసు, జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఆఫీసులకు వెళ్తుంటారు. తాజాగా క్రాంతినగర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. తాత్కాలికంగా ఈ రోడ్డు నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. వికాస్‌నగర్ మీదుగా లింక్ రోడ్డు ఉన్నప్పటికీ..స్థానికులు దాన్ని గేటెడ్‌కమ్యూనిటీలా ఫీలవుతూ..దారులను మూసివేశారు. రోడ్డుకు అడ్డుగా రాళ్లు నాటారు. నిర్మాణ వ్యర్థాలు పోయించారు. ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– వక్కలంక శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి, డాక్టర్స్ కాలనీ

టెక్నాలజీని వినియోగించుకోండి

వెరిజాన్ సంస్థ సీనియర్ డైరెక్టర్ సుందర్ సదాపతి

మహేశ్వరం: విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని వినియోగించుకోవాలని వెరిజాన్ సంస్థ సీనియర్ డైరెక్టర్ సుందర్ సదాపతి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో సిటిజెన్ వెరిజాన్ ఇండియా స్పైస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వారి సహకారంతో విద్యార్థులకు 12 ల్యాప్‌టాప్‌లు, ప్రొజెక్టర్ అందజేశారు. అనంతరం ఫిజికల్, సైన్స్‌ల్యాబ్, బయోలాజికల్ ల్యాబ్‌లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుతూ మారుతున్న కాలానికి అనుణగుణంగా టెక్నాలజీని వినియోగించుకొని ప్రత్యేక్ష అనుభవాల ద్వారా సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించి భవిష్యత్తులో విద్యార్థులు తమ లక్ష్యాలను ఏ విధంగా చేరుకోవాలో తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బి. ధనుంజయ్, ఇండియా లిటరసీ ప్రాజెక్టు టీం సభ్యులు శ్రీనివాస్, వెరిజాన్ సంస్థ ప్రతినిథులు సతీశ్ మందపాటి, రఘునాథ్ మందపాటి, సింగారావేలు, సుజ్జి, రుద్రయ్య, నిహారిక, అర్చన, రేవతి, సూరన్, నిధి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌కి కంప్యూటర్లు, ల్యాప్‌టాప్, ప్రొజెక్టర్లను అందజేస్తున్న సుందర్ సదాపతి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్

మహేశ్వరం: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యర్తలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలం సీజన్ కావడంతో వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ సోకకుండా వార్డుల్లో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వ్యాధులకు చికిత్స, బస్తీ దవాఖానలో ఉచితంగా నిర్వహిస్తారన్నారు. డెంగ్యు సంబంధిత పరీక్షలు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ సెంటర్ కందుకూరులో చేస్తారన్నారు. 2 నుంచి 15 సంవత్సరాల పిల్లలకు మెదడు వాపు వ్యాధి టీకాలను వేయించాలన్నారు. అనంతరం తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మేనేజర్ టి.పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ మల్లేష్, జంగయ్య, వైద్యులు, కౌన్సిలర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- అంగన్‌వాడీ, గ్రంథాలయ భవనాలు ప్రారంభం

కందుకూరు: పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి సూచించారు. సామాజిక బాధ్యతలో భాగంగా అమెజాన్ సంస్థ మండలంలోని నేదునూరులో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, కొత్తూర్‌లో నిర్మించిన గ్రంథాలయాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కొత్తగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కొత్తూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడేలా అమెజాన్ సంస్థ అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయాలు నిర్మించడం గొప్ప విషయమని కొనియాడారు. గ్రంథాలయాలు యువత సన్మార్గంలో నడిచేలా ఉపయోగపడతాయన్నారు. పుస్తక పఠనంతో జ్ఞానం పెంచుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలతో పని లేదని, అందరూ కలిసి ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయంపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారని తెలుసుకున్న ఆమె బడంగ్‌పేటలోని జిల్లా గ్రంథాలయానికి కూడా ఏర్పాటు చేయాలని అమెజాన్ సంస్థను కోరారు. కార్యక్రమంలో అమెజాన్ ప్రతినిధి శంకర్, సెర్ప్ ప్రతినిధి పార్థసారథి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, డైరెక్టర్ ఆనంద్, ఎంపీడీఓ సరిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు జయేందర్, ఇందిరదేవేందర్, లక్ష్మీనర్సింహారెడ్డి, దశరథ, కృష్ణగౌడ్, మేఘనాథ్‌రెడ్డి, అంజయ్య, వసంత, గోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవర్ధన్, దేవేందర్, దామోదర్‌గౌడ్, నర్సింహ, సామయ్య, బాబుగౌడ్, శేఖర్, సురేష్, రాజశేఖర్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి, యాదయ్య, కృష్ణ, కొండల్‌రెడ్డి, దేవులా, వెంకటేష్, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ, రాజు, నరేందర్, శివ, నర్సింహ, లక్ష్మణ్‌చారి, మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడలో విద్యార్థులతో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

పెండింగ్ వేతనాలు చెల్లించండి

- సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్
- మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కందుకూరు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఇన్‌చార్జి ఎంఈఓ మనోహర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలలుగా పెండింగ్ ఉన్న కోడిగుడ్ల బిల్లులు, జీతాలు చెల్లించాలన్నారు. 20 ఏళ్లగా కష్టాలకు ఓర్చి విద్యార్థులకు పాఠశాలల్లో వంట చేసిపెడుతున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. జిల్లాలోని ఏడు మండలాల్లో మన్నా అనే స్వచ్ఛంద సంస్థకు మధ్యాహ్న భోజనం అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లుగా సమాచారం వచ్చిందన్నారు. అటువంటి పనులు ప్రభుత్వం వెంటనే విరమించుకోవడంతో పాటు కార్మికుల సమస్యలు పూర్తిగా పరిష్కరించాలని ఈ నెల 15వ తేదీ నుంచి మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షుడు కల్యాణ్‌కార్ శ్రీనివాస్, కార్యదర్శి ప్రభావతి పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

దుర్గాదేవికి వేపాకులతో అలంకరణ

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయంలో ఆషాఢ మాస మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం దుర్గాదేవి అమ్మవారిని వేపాకులతో సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్ యాదవ్, యాదగిరి, హనుమంతరావు, కేశవులు, రమణమూర్తి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా బోనాల పండుగ

మలక్‌పేట: ఆధ్యాత్మిక ఉట్టిపడేలా బోనాలు పండుగ జరుపుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బి. భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయ నిర్వాహకులకు శుక్రవారం బోనాల పండుగ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆషాఢ మాస బోనాల పండుగకు అందించే నిధులు 10 శాతం పెంచడం హర్షణీయమన్నారు. బోనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఆలయాల వద్ద భక్తులు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సురేఖ, గోవర్ధన్, ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, మురళీ, యాదగిరి, హరి, వినయ్, ఉమేష్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మలక్‌పేట: సీఎం సహాయ నిధితో ఎంతోమంది పేదల రోగుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఫర్హత్‌నగర్, కాలాడేరా కాలనీ, చంచల్‌గూడ, ఆజంపుర, వాహేద్‌నగర్, ఆఫ్జల్‌నగర్, ఓల్డ్ మలక్‌పేట, మూసారంబాగ్, సైదాబాద్, చవ్ని ప్రాంతాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పథకం నిరుపేద వర్గాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్–1లో అర్బన్ బయోడైవర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుజాతనాయక్‌తో కలసి రాంరెడ్డి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఇంటింటికీ ఒక మొక్క చొప్పున నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రావు, సత్యనారాయణ, ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ జకియా సుల్తానా, ఏఈ హేమూనాయక్, నాయకులు వెదిరె యోగేశ్వర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి యాదగిరిరెడ్డి, గణేశ్, మధు, మురళి, దిండి శశిధర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిరన్, మంజులారెడ్డి, శివ,బద్రి, అస్లాం, షాకీర్, నరసింహ, శీనునాయక్, సతీష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, బ్రహ్మరెడ్డి, మమతా మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పదిలం

హస్తినాపురం: సహజ వనరుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణ సామాజిక అంశాలపై విద్యార్థులకు భాగస్వాములను చేసి పాఠశాల స్థాయి నుంచే వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ టి.సురేందర్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహపురం కాలనీలోని కిండిల్ కిడ్స్ స్కూలు ఆవరణలో ఇంకుడు గుంతలను పునరుద్ధరించే కార్యక్రమాన్ని జలమండలి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల బాగు కోసం భూగర్భ జలాలను సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వర్షపు నీటిని ఒడిసి పట్టుకునేందుకు ఇంకుడు గుంతలను ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తమ పరిసరాలలో ఏర్పాటు చేసుకున్న ఇంకుడు గుంతలను తరుచూ శుభ్రపరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఇంకుడు గుంతల నిర్మాణం వాటి నిర్వహణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కిండిల్ కిడ్స్ స్కూలు చైర్మన్ మేడ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మేడ నందితరెడ్డి, ఉపాధ్యాయులు స్వాతి, అనూష, మాధవి, శిల్ప, పిఈటీ లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలోని పార్కులను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర్ నార్త్ కాలనీలో రోడ్ నెం 1లోని పార్కును శుక్రవారం సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోగుల రాంబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహాయ, సహకారాలతో పార్కులో వాకింగ్ టైల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఓపెన్ జిమ్‌కు అవసరమైన వస్తువులను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు అనిల్ చౌదరి, బుచ్చిరెడ్డి, సతీష్‌గౌడ్, శివశంకర్, శ్రీకాంత్, మనోజ్, రాజేందర్‌రెడ్డి, నాగరాజ్, ఆదిత్య, వేణుగోపాల్, కృష్ణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలలో నీటిని నిల్వ ఉంచొద్దు

- అవగాహన కార్యక్రమంలో డీసీ జకియా సుల్తానా

చంపాపేట: ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతీ వ్యక్తిపై ఉందని ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ జకియా సుల్తానా అన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్కిల్ ఎంటమాలజీ అధికారి మణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దోమల నివారణపై ఆవగాహనా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జకియా సుల్తానా మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోధకాలు వంటి సీజనల్ వ్యాధుల పట్ల కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు వృద్ధి చేసేందుకు ఆస్కారం ఉన్న స్థలాలు, దోమ కాటు వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధుల గురించి తమ పాఠ్యాంశాలలో నేర్చుకున్న విషయాలను తల్లిదండ్రులకు, పరిసర కాలనీవాసులకు వివరించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ పెంటయ్య, డీఈ వెంకటేశ్వర్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



దోమల నివారణపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీ జకియా సుల్తానా

అనునిత్యం సేవకుడిగా మీ ముందుంటా

- మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి అనునిత్యం సేవకుడిగా మీ ముందుంటానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి సిరిహిల్స్‌కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కు ప్రహరీగోడను శుక్రవారం కార్పొరేటర్ ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడుతున్నట్లు స్పష్టం చేశారు. కాలనీలలో సమస్యలను తన దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కాలనీలలో మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించుకోవాలని, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ముందుకు వెళ్దామని కోరారు. సిరిహిల్స్‌కాలనీలో మిగిలిపోయిన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతానని, అదేవిధంగా డ్రైనేజీ ట్రంక్‌లైన్ పూర్తికాగానే అంతర్గత డ్రైనేజీ లింక్ పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రవీంద్రారెడ్డి, శ్రీనివాస్ నాయక్, వెంకటేష్‌గౌడ్, బాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, మురళీ, ఆనంద్‌రెడ్డి, చారి, ప్రసాద్, నాయకులు కడారియాదగిరి యాదవ్, శ్యాం సుందర్‌రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్, జయతేజ, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసన రాకుండా చర్యలు

మన్సూరాబాద్ పెద్దచెరువులోకి మురుగు నీరు చేరుతుండటంతో తీవ్ర దుర్వాసన వస్తుందని వాకర్స్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ స్పందించి హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యతో కలసి శుక్రవారం ఉదయం పెద్దచెరువును సందర్శించారు. రానున్న 24 గంటలలోపు సమస్యను పరిష్కరించి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు చేపడుతామని వాకర్స్‌కు కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి, డీసీ తిప్పర్తి యాదయ్యలు హామీ ఇచ్చారు.